క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌యాదవ్, కాలనీవాసులు

జవహర్‌నగర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ బీరప్పగడ్డలో రూ.6 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ స్థానిక కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. రాజు యాదవ్, రమేష్, ఆంజనేయులు, సత్యనారాయణ, లింగం తదితరులు పాల్గొన్నారు.

కొండల్‌రావుకు కవి రత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కొండల్‌రావు

మేడ్చల్: అత్వెల్లి సెయింట్ క్లారెట్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గుండవరం కొండల్‌రావుకు కవిరత్న అవార్డు లభించింది. నగరంలోని రవీంద్రభారతిలో భవానీ సాహిత్య వేదిక, చౌదూరి కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయనకు కవిరత్న పురస్కారం అందజేశారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి

శామీర్‌పేట్: ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. తూంకుంట పురపాలక సంఘ పరిధిలోని దేవరయంజాల్‌లో ఓ వాణిజ్య సముదాయాల యజమాని సాదా వసంత్ రెడ్డి రూ.3.5 లక్షలు ఇంటి పన్ను సోమవారం చెల్లించారని తెలిపారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లించి పెనాల్టీ పడకుండా చూసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిగౌడ్, రఘుపతిరెడ్డి, రాజేష్‌గౌడ్, శ్రీలత, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం

మల్కాజిగిరి: గర్భిణులకు సామూహిక సీమంతం మాజీ కార్పొరేటర్ మురుగేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం కార్పొరేటర్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలకు కులమతాలకు అతీతంగా చేయూత, భరోసా ఇవ్వడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. లక్ష్మి, సంతోషి, మాధవి, శారద, ముంతాజ్, బాలామణి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరనగర్‌లో...

బీఆర్‌ఎస్ పార్టీ నేత చిన్నయాదవ్ బతుకమ్మ పండుగ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, ఆశావర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. నవీన్ యాదవ్, కవిత, మాధవి, రజిని, జ్యోతి, సునంద పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్: మినీ శిల్పారామంలో దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సోమవారం అడపా భరణి శిష్యబృందంచే నిర్వహిరిచిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బతుకమ్మ పండుగతో పాటు స్టాల్స్ సైతం ఆకట్టుకుంటున్నాయి.

గ్రూప్ -1 ర్యాంకర్‌కు సత్కారం

కుషాయిగూడ: గ్రూప్–1లో 300ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎన్నికైనా చక్రిపురం వాసి సబితానాయక్‌ను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, మారుతీకాలనీ శ్రీనివాస్,కార్యదర్శి కిషన్ నాయక్, శేఖర్‌నాయక్, దశరథ్‌నాయక్, హన్మంతు, వీరన్న ఉన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ బదిలీ

బోడుప్పల్: నగర పాలకసంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డి నాగారం మేనేజర్‌గా ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. సోమవారం కమిషనర్, డైరెక్టర్ బదిలీ చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన నిజాంపేట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా బోడుప్పల్‌కు వచ్చాడు. రెండేళ్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల మేడ్చల్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా అవార్డు అందుకున్నారు. పీర్జాదిగూడ నగర పాలకసంస్థలో ఆర్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ జహీరాబాద్ మేనేజర్‌గా ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు.

తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి..



మేడ్చల్‌లో..



అన్నోజిగూడ ప్రకాశ్‌రావు నగర్‌లో మిత్ర కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

సాక్షి, మేడ్చల్ జిల్లా/మేడ్చల్ జోన్ బృందం: తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటాపాటలతో గౌరమ్మను కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మ అని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె స్వయంగా బతుకమ్మను పూలతో పేర్చి సంబురాల్లో పాల్గొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరఫున జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, ఏడీ సర్వే అండ్ ల్యాండ్, జిల్లా ట్రెజరీ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ ఆడారు. వివిధ శాఖల్లోని మహిళా అధికారులు, ఉద్యోగులు తమ ఇంటి వద్ద నుంచి తెచ్చిన తీరొక్క పూలతో పెద్ద, పెద్ద బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి శారద, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, జిల్లా ఇన్‌చార్జి ట్రెజరీ అధికారి హైదర్ అలీ, టీజీఓ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, మహిళా ఉన్నతాధికారులు, కలెక్టరేట్‌లోని మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో..



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు





అంకుషాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మైసమ్మగూడలో..



మేడ్చల్‌లో..



కలెక్టరేట్‌లో..

సరస్వతీ నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన సోమవారం అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పూజలు నిర్వహించిన అనంతరం నిర్వాహకులు అందజేశారు.

– మేడ్చల్ జోన్ బృందం



గడిమైసమ్మ



గుండ్లపోచంపల్లిలో..



బోగారంలో పూజల్లో సీఐ అంజనేయులు, నాయకులు



తూంకుంట శ్రీగాయత్రి మహాక్షేత్రంలో..



కీసరగుట్టలో..



పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లో సరస్వతీ పూజలో కాలనీవాసులు



ఘట్‌కేసర్ శివారెడ్డిగూడలో..

ప్రభుత్వ భూముల్లోని | అక్రమ నిర్మాణాలను తొలగించండి

తహసీల్దార్లను ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూములను కాపాడే దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలను తొలగించాలని మండలాల తహసీల్దార్లను మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ లాగిన్ ఐడిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరిగతిన పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి రెవెన్యూ పెండింగ్ అంశాలపై సోమవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో భూభారతి, ఆర్‌ఓఆర్, టీజీపాస్ దరఖాస్తుల పెండింగ్ క్లియర్ చేయాలని తహసీల్దార్లను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌కు గల కారణాలను తహసీల్దార్లను ఆయన అడిగి తెలుసుకోవడంతో పాటు తగిన సూచనలు జారీ చేశారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చొరవ తీసుకొని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో లా ఆఫీసర్ చంద్రావతి, కీసర, మల్కాజిగిరి ఆర్డీవోలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాష్, జిల్లాలోని వివిధ తహసీల్దార్లు పాల్గొన్నారు.



పండగ వేళ.. కలెక్టరేట్‌లో 58 ఫిర్యాదులు

రెవెన్యూ శాఖపైనే 12 ఫిర్యాదులు రాక

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో సోమవారం 58 ఫిర్యాదులు రాగా, ఇందులో కలెక్టరేట్‌లోని డి–సెక్షన్‌కు సంబంధించి 16, ఇ–సెక్షన్‌లోని సమస్యలపై రెండు ఫిర్యాదులు అందాయి. అలాగే, రెవెన్యూ శాఖకు సంబంధించి కీసర ఆర్డీఓకు 4, మల్కాజిగిరి ఆర్డీఓకు 3, మల్కాజిగిరి తహసీల్దార్‌కు 3 ఫిర్యాదులను అందజేశారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, డీఎంహెచ్‌ఓ, డీసీఓ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు కలెక్టరేట్ ప్రజావాణిలో వచ్చాయి. సద్దుల బతుకమ్మ, దసరా పండుగ వేళ కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. జిల్లా అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ ప్రజావాణిలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డితో కలిసి ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ) రాధిక గుప్తా స్వీకరించారు. మొత్తం 58 ఫిర్యాదులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. అర్జీలను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో పెట్టకూడదని హెచ్చరించారు.

విశ్రాంత జీవితం సంతోషంగా గడపాలి

శామీర్‌పేట్: ప్రభుత్వ ఉద్యోగుల జీవితంలో ఉద్యోగ విరమణ సాధారణమని, ఎలాంటి ఒత్తిడికి లోనూ కావొద్దని, విశ్రాంత జీవితం ఆరోగ్యంగా సంతోషంగా గడపాలని మేడ్చల్ జిల్లా పరిషత్ సీఈవో కాంతమ్మ ఆకాంక్షించారు. శామీర్‌పేట మండల పరిషత్ సమావేశ మందిరంలో శామీర్‌పేట మండల ఇన్‌చార్జి ఎంపీడీవో, జెడ్పీ సూపరింటెండెంట్ సంపత్ కుమార్ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన శామీర్‌పేట ఎంపీడీఓ సంపత్ కుమార్ అందరితో కలివిడిగా ఉండి ఉత్తమ సేవలు అందించారని ప్రశంసించారు. సీఈఓ, డిప్యూటీ సీఈఓ, అధికారులు, ప్రజాప్రతినిధులు సంపత్ కుమార్ దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ బ్యాంక్ కాలనీ పార్కులో సద్దుల బతుకమ్మకు కార్పొరేటర్ బన్నాల గీత ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ డీఈ వినీల్‌గౌడ్, ఏఈతో కలిసి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు.

కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడోత్సవాల్లో చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, లెమన్ – స్పూన్, రన్నింగ్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించగా, ఇందులో 100 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా టీజీఓ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్మోహన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీ, జిల్లా స్పోర్ట్స్ అధికారి దామోదర్ రెడ్డి, లీడ్ బంక్ మేనేజర్ శివకుమార్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

డీఎస్పీగా నాగారం మున్సిపల్ వార్డు ఆఫీసర్ సబిత



గ్రూప్-1లో డీఎస్పీగా ఉద్యోగం సాధించిన ధారావత్ సబిత

కీసర: నాగారం మున్సిపాలిటీలో 13వ వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ధారావత్ సబితా గ్రూప్–1 ఉద్యోగం సాధించింది. ఆదివారం వెల్లడించిన ఫలితాల్లో ఆమె డీఎస్పీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. కుషాయిగూడలోని చక్రిపురంలో నివాసం ఉంటూ నాగారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్–1కు ప్రయత్నించి 303 ర్యాంకు సాధించి డీఎస్పీగా ఉద్యోగం సాధించారు. ఆమె తల్లిదండ్రులతో పాటు నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ సురేష్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మరో ఉద్యోగి సుధా రవలి గ్రూప్–2లో విజయం సాధించి ఎంపీఓగా ఎంపికయ్యారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు గ్రూప్స్‌లో విజయం సాధించి ఉద్యోగాలు సాధించడం పట్ల స్థానికంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



మల్కాజిగిరి: పూర్వ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు చేయూతను అందించాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హనుమయ్య అన్నారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 2002–03 పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. ఒకప్పటి కంటే ఇప్పుడు ప్రభుత్వం వసతులు కల్పించడమే కాకుండా విద్యా విధానంలో చాలామార్పులు తీసుకొచ్చిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులంతా ఒక్కచోట చేరడానికి కృషిచేసిన పూర్వవిద్యార్థులైన నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీధర్, సీఫెల్ పరమేశ్వర్, మణిపాల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు వెంకటేశ్వర్లు, సాగర్‌లను ఉపాధ్యాయులు అభినందించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మల్లాపూర్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ కేఎల్‌రెడ్డినగర్ కాలనీలో రూ.14 లక్షలతో సీసీరోడ్డును కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో అవసరమైన చోట సీసీరోడ్లను వేయిస్తున్నామన్నారు. స్థానికులు మహేందర్‌రెడ్డి, యాకుబ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అపార్ట్‌మెంట్‌వాసులు శివగౌడ్ మూర్తి, సంతోష్, శ్రీనివాస్, నవీన్, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా.. మీ ఇల్లు సేఫ్..

- దసరాకు ఊరెళ్తున్నారా జరభద్రం
- బంగారు ఆభరణాలు, డబ్బు ఇంట్లో వద్దు
- సూచనలు పాటించాలంటున్న పోలీసులు



పండగ వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్(ఫైల్)

ఘట్‌కేసర్: పండగలు వచ్చాయంటే నగరం నుంచి సొంత ప్రాంతాలకు క్యూ కడుతుంటారు.. దాదాపు ప్రతి పండగకు ఒకటి రెండు రోజుల ముందు ఊళ్లకు వెళ్తుంటారు. అయితే దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పెద్ద పండగలకు మాత్రం చాలామంది వారం రోజుల ముందుగానే ఊళ్లకు వెళ్తుంటారు. పిల్లలకు దసరా సెలవులు ఉండటంతో పాటు బతుకమ్మ వేడుకలో పాల్గొనేందుకు మహిళలు వారం పది రోజుల ముందే సొంత ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే ఈ సమయంలో ఇళ్లలో చోరీలు జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు కొన్ని రోజులుగా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఊరికి వెళ్లేముందు పోలీస్ స్టేషన్‌లో ఒకసారి సమాచారం అందించాలని సూచిస్తున్నారు. సంతోషంగా ఉండాల్సిన సమయంలో అజాగ్రత్తగా ఉంటే చోరీలు జరిగే ప్రమాదముందని, ఎవరికి వారు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వారు చెబుతున్నారు. రాత్రి వేళలో అన్ని కాలనీల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తామని, ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు చెబుతున్నారు.

కొన్ని జాగ్రత్తలు..

పండగకు ఊరికి వెళ్లేవారు విలువైన వస్తువులు, ఆభరణాలు, డబ్బులు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. ఇంటి పరిసరాల్లో నమ్మకంగా ఉండేవారికి సమాచారం అందించి ఊరి నుంచి తిరిగి వచ్చేంత వరకు కనిపెట్టి ఉండాలని చెప్పాలి. తాళం వేసిన ఇంటిలో ఏదో ఓ గదిలో లైటు వేసి ఉంచాలి. ఇంట్లో ఎవరో ఉన్నారని దొంగలు భావిస్తారు. ఇంటికి వేసిన తాళం కనిపించకుండా ఉండేందుకు కర్టెన్ వేసి ఉంచాలి. తమ వాహనాలను ఇంటి ఆవరణలో నిలిపి హ్యాండిల్ లాక్ వేయాలి. బీరువా తాళం ఇంటిలో పెట్టవద్దు. పేపర్, పాలు వేసే వారిని రావొద్దని, పని మనుషికి మాత్రం రోజూ వాకిలిని శుభ్రం చేయాలని చెప్పాలి. విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులతో మాట్లాడరాదు. ఇంటిలో సీసీ కెమెరాలు ఉంటే మొబైల్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలి. కాలనీలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే 100 టోల్ ఫ్రీ నంబర్, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.

పోలీసులకు సమాచారం అందించాలి



విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకూడదు. ఇంట్లో వ్యక్తులు ఉన్నారనే భయం దొంగలకు కల్పించాలి. పండగకు ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేస్తాం. ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. కాలనీల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే 100 టోల్ ఫ్రీ నంబర్, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. ఊర్లకు వెళ్లే ముందు పోలీసులకు సమాచారం అందించాలి.

– బాలస్వామి, ఇన్‌స్పెక్టర్, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్